కల్తీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 7మద్యం బాటిళ్లు, 106 ఖరీదైన ఖాళీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...కాచిగూడ, ఉస్మాన్‌నగర్ ప్రాంతానికి చెందిన గొరికి శ్రీనివాస్ స్థానిక పల్టాన్ రోడ్డులో కల్తీ మద్యం తయారు చేసి, తక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఖరీదైన ఖాళీ మద్యం సీసాల్లో చీఫ్ లిక్కర్ నింపి మందుబాబులను బురిడీ కొట్టిస్తున్నాడు. ముఖ్యంగా విందులు, వినోదాలకు పెద్ద ఎత్తున శ్రీనివాస్ నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు కల్తీ మద్యం తయారీ కేంద్రంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 7మద్యం బాటిళ్ళు, 106ఖరీదైన ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలి

హిమాయత్ నగర్ , జూన్ 19: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట చేస్తున్న హత్యా కాండను తక్షణమే నిలిపివేసి ఆదివాసీలు స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావులు మాట్లాడుతూ.. దేశంలో మానవత్వం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని పౌర సమాజం ఎంతగా ఘోషిస్తున్నప్పటికీ పెడచెవిన పెట్టి ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగిస్తుందని మండిపడ్డారు. మావోయిస్టు పార్టీకి, అప్పటి ప్రభుత్వానికి మధ్య 2004లో జరిగిన చర్చల ప్రతినిధి గణేశ్‌తో పాటు రవి, అరుణ, అంజులను పట్టుకుని కాల్చి చంపారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. మనుషుల ప్రాణాలను హరిస్తూ, చట్టాలు, రాజ్యాంగాన్ని సైతం కేంద్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పౌర సమాజం చర్చలు జరిపి, శాంతిని నెలకొల్పాలని విభిన్న రకాలుగా కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నా ఎన్‌కౌంటర్ల తోనే సమాధానం చెప్పడం దౌర్భాగ్యమన్నారు. దండకారణ్యంలో ఇప్పటి వరకు 550 మందికి పైగా చంపగా అందులో అధిక శాతం ఆదివాసీ ప్రజలే ఉన్నారని తెలిపారు. మారేడుపల్లి ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నేతలు బల్ల రవీందర్, రాము, నాగభూషణం , తదితరులు పాల్గొన్నారు.

36 వేలకు పైగా నకిలీ వాటర్ బాటిల్స్ సీజ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : అనుమతి లేకుండా ఐఎస్ఐ మార్కును ముద్రిస్తూ పలు హోటళ్లు, వాణిజ్య కేంద్రాల పేర్లతో వాటర్ బాటిళ్లు తయారు చేస్తున్న ఓ కేంద్రంపై బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు చేశారు. గురువారం మూసాపేట్‌లోని ఓ కేంద్రంపై దాడులు నిర్వహించి వేల సంఖ్యలో బాటిళ్లపై లైసెన్సు గడువు ముగిసినా ఐఎస్ఐ ముద్ర వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దాదాపు 13వేల అరలీటర్, 8వేల లీటరు బాటిళ్లు, 15వేల పావులీటర్ బాటిళ్లను బీఐఎస్ అధికారులు జప్తు చేశారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సవిత మాట్లాడుతూ.. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌తోపాటు ఏ ఉత్పత్తి అయినా బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా ఐఎస్ఐ ముద్ర వినియోగించడం నేరమన్నారు. తయారీదారులు బీఐఎస్ ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత పలు పరీక్షలు, నియమాలు పూర్తయిన తర్వాతే వారికి లైసెన్సు మంజూరు చేస్తామని.. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టణ ఆరోగ్యానికి కష్టాలు

- పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అద్దె చెల్లించని సర్కార్
- నీరు, కరెంట్ సరఫరా నిలిపివేస్తున్న యజమానులు
- జవహర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలను నిలిపివేసిన సిబ్బంది

బంజారాహిల్స్, జూన్ 19: పేదలు నివాసం ఉంటున్న బస్తీల్లో ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఒకవైపు వైద్యులు, మందుల కొరతతో రోగులు ఇబ్బందులకు గురవుతుంటే.. మరికొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల అద్దె బకాయిలు పేరుకుపోవడంతో యజమానుల నుంచి ఖాళీ చేయాలంటూ ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. సుమారు ఏడాదినుంచి అద్దె బకాయి ఉండటంతో జూబ్లీహిల్స్ రోడ్ నం.5 జవహర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఖాళీ చేయాలంటూ యజమాని అనేక రకాలుగా ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన జిల్లా వైద్యశాఖ అధికారులు తమకు ఏం సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో స్థానికంగా పనిచేస్తున్న వైద్యసిబ్బంది రోగులకు సేవలు అందించేది లేదంటూ మొండికేస్తున్నారు. అరకొర సౌకర్యాలతో తాము రోగులకు సేవలు అందించడం కష్టమని, ఓపీ సేవలు నిలిపివేయాలని ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు వచ్చాయంటూ వారం రోజులుగా జవహర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్ సేవలు ఆపేశారు. వివిధ రకాలైన ఆరోగ్య సమస్యలతో వచ్చేవారిని ఇందిరానగర్‌లోని బస్తీ దవాఖానాకు, 3 కిలోమీటర్ల దూరంలోని షౌకత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటూ పంపించి వేస్తున్నారు.

రూ.2.5లక్షల మేర బకాయి..

దాదాపు 10ఏళ్లుగా జవహర్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రానికి సంబంధించి సుమారు రూ.2.5లక్షల మేర అద్దె బకాయి ఉంది. దీంతో ఏడాది నుంచి అద్దె కోసం యజమాని ఒత్తిడి చేయడం ప్రారంభించాడు. అద్దె రాకపోవడంతో నీటి సరఫరా ఆపేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం నీరు లేని పరిస్థితి. ఇక్కడ ఇన్‌చార్జి డాక్టర్‌తో పాటు ముగ్గురు ఏఎన్ఎమ్‌లు, స్టాఫ్ నర్స్, డీవో, సూపర్‌వైజర్, అటెండర్, స్వీపర్ సహా 10 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇంటి యజమాని నీటి సరఫరా నిలిపివేయడంతో అప్పుడప్పుడు కరెంట్ సరఫరా కూడా ఆపేస్తుండటంతో ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.

చేతులెత్తేసిన జిల్లా అధికారులు..?

జవహర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉన్న అద్దె సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన జిల్లా వైద్యశాఖ అధికారి డా.వెంకటితో సహా మిగిలిన అధికారులు చేతులెత్తేశారా.. అంటే అవును అనే సమాధానాలు వినిపిస్తున్నాయి. నెలరోజుల క్రితం పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన డా.వెంకటికి స్థానికులతో పాటు సిబ్బంది సమస్యలను ఏకరువు పెట్టారు. కిరాయి కోసం యజమాని చేస్తున్న ఒత్తిళ్లు. నీటి సరఫరా కట్ చేసిన వైనాన్ని వివరించారు. అయితే ఇవేవీ పట్టించుకోని సదరు అధికారి ఇక్కడినుంచి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వేరేచోటకు మార్చుకోండి అంటూ ఉచిత సలహా ఇచ్చి వెళ్లిపోయారు. దీంతో స్థానికంగా ఏదైనా భవనంలోకి మార్చుకోవాలని ఉద్యోగులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. స్థానికంగా ఉన్న కమ్యూనిటీహాల్‌లోకి తాత్కాలికంగా పీహెచ్‌సీని మార్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ లేఖలు రాశారు. అయితే సర్కిల్ 18 డీఎంసీ మాత్రం ఇప్పటిదాకా కమ్యూనిటీహాల్ కేటాయింపు వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఓపీ సేవలు నిలిపివేత..

ఒకవైపు యజమాని ఒత్తిళ్లు, మరోవైపు రోగుల తాకిడితో విసిగిపోయిన వైద్య సిబ్బంది ఓపీ సేవలు నిలిపివేశారు. రోజుకు సుమారు 100 నుంచి 150మంది వివిధ సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. వారిని వెనక్కి పంపుతుండటంతో బస్తీ దవాఖానాకు వెళ్లలేక, 3 కిలోమీటర్ల దూరంలోని షౌకత్‌నగర్ పీహెచ్‌సీకి వెళ్లలేక రోగులు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జవహర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓపీ సహా అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని, డెంగీ తదితర సమస్యలతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉన్న తరుణంలో పీహెచ్ఎంసీని మూసేసే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదంటూ స్థానికులు హెచ్చరించారు.

రాజా సాహెబ్ టీజర్ లీక్‌పై ఫిర్యాదు

బంజారాహిల్స్, జూన్ 19: ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాహెబ్ సినిమాకు సంబంధించిన టీజర్‌ను అధికారికంగా విడుదలచేయడానికి ముందే లీక్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ చిత్ర యూనిట్ సభ్యులు గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న రాజా సాహెబ్ సినిమా టీజర్‌ను ఈ నెల 16న విడుదల చేశారు. అయితే అంతకు ముందుగానే కొన్ని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికల మీద టీజర్ కనిపించినట్లు చిత్ర యూనిట్ గుర్తించింది. బంజారాహిల్స్ రోడ్ నం.2లోని సాగర్ సొసైటీలోని వారాహి స్టూడియోస్‌లో టీజర్‌కు సంబంధించిన డబ్బింగ్ జరిగిందని, అక్కడినుంచి టీజర్ లీక్ అయిందేమో అని అనుమానం వ్యక్తం చేస్తూ రాజా సాహెబ్ సినిమా డబ్బింగ్ ఇన్‌చార్జి వసంత్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పేరుతో కొట్టాడు..

ఉస్మానియా యూనివర్సిటీ: చికిత్స పేరుతో ఓ థెరపిస్ట్ నాలుగేళ్ల చిన్నారిని కొట్టాడు. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లోని వైబ్రెంట్ వింగ్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఒక చిన్నారి ఆటిజం వ్యాధికి చికిత్స తీసుకుంటుంది. అక్కడి థెరపిస్ట్ రంజిత్.. చిన్నారికి చికిత్స చేస్తున్నానంటూ కొడుతూ, గిచ్చుతూ హింసించాడు. చికిత్స నిమిత్తం చిన్నారి తల్లిదండ్రులు రూ.60వేల నుంచి రూ. లక్ష వరకు చెల్లించారు. చిన్నారిని కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొప్ప ధైర్యశాలి శాఖమూరి సుగుణమ్మ

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నిరంకుశ నిజాం సైన్యం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు శాఖమూరి సుగుణమ్మ ధైర్యం చాలా గొప్పదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ తెలిపారు. ఇటీవలే మరణించిన సుగుణమ్మ భౌతికకాయాన్ని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా నారాయణతోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, బీవీ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జ్యోతి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి వీ చెన్నకేశవరావు తదితరులు సుగుణమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కారు డోర్ తగిలి .. కిందపడి

నిండు గర్భిణిపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు

బండ్లగూడ, జూన్ 19: కారు డ్రైవర్ నిర్క్ష్యానికి ఓ నిండు గర్భిణి బలైంది. చెకప్ కోసం దవాఖానకు వెళ్లి తిరిగి భర్తతో కలిసి బైక్‌పై వస్తుండగా కారు డోర్ తగిలి కిందపడగా.. ఆమె పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం. బాలాపూర్ మండలం, మల్లాపూర్‌కు చెందిన సయ్యద్ జమీర్ భార్య ఆశ్రమ ఫాతిమా 9 నెలల గర్భవతి. గురువారం బైక్‌పై ఆమెను పిల్లర్ నంబర్ 90 వద్ద ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. తిరిగి వస్తుండగా పిల్లర్ నంబర్ 190 వద్ద ఓ కారు డ్రైవర్ డోరు తీయగా.. బైక్ డోర్‌కు తగిలి కింద పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఆశ్రమ పైనుంచి పోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనతో అక్కడ భారీ స్థాయిలో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. భర్త జమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొరపాటున డబ్బు పంపానంటూ మోసం

మహిళకు రూ.1లక్ష టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు

వెంగళరావునగర్, జూన్ 19 : మీ బ్యాంకు అకౌంట్‌కు పొరపాటున డబ్బు పంపానంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ మహిళకు రూ.1లక్షల టోకరా వేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద నివాసం ఉండే ఉమాదేవి (58)కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి.. మీ బ్యాంకు అకౌంట్‌కు పొరపాటున రూ.20వేలు పంపానని ..ఆ డబ్బు తిరిగి పంపాలని కోరాడు. దాంతో ఆమె తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసుకుంది. బ్యాంక్ లావాదేవిలానే ఆ మెసేజ్ పోలి ఉంది. దీంతో ఉమాదేవి ఆ డబ్బు అతని అకౌంట్‌కు పంపింది. అనుకోకుండా మరో రూ.30 వేలు పంపానని ఆ వ్యక్తి చెప్పడంతో.. మెసేజ్ చూసుకుని ఆ డబ్బు పంపింది. అలా ఆమె నుంచి పలు దఫాలుగా రూ.లక్ష కాజేశారు సైబర్ నేరగాళ్లు. ఆ తర్వాత అనుమానంతో బ్యాంక్ బ్యాలెన్స్ చెక్‌చేసుకోగా రూ.లక్ష తక్కువగా ఉందని గుర్తించింది. వెంటనే ఉమాదేవి ఆఫీస్‌లో ఉన్న తన కుమారుడు క్రాంతికుమార్‌కు ఫోన్ చేసి చెప్పింది. గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో రూ. 3.21 లక్షలు చీటింగ్

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 3.21 లక్షలు బురిడీ కొట్టించారు. వివరాల్లోకి వెళ్తే.. జవహర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అనితశ్రీవాత్సవ పేరుతో ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఆ తరువాత టెలిగ్రామ్ ఐడీలో ఈ నంబర్‌ను యాడ్ చేశారు. ప్రైస్‌రన్నర్ అనే సంస్థలో పార్ట్‌టైమ్ జాబ్‌లో రిసెప్షనిస్ట్ ఉద్యోగమంటూ ఆఫర్ ఇచ్చారు. కొన్ని టాస్క్‌లుంటాయని, వాటిని పూర్తి చేస్తే రోజుకు రూ. 2. వేల నుంచి రూ. 5 వేల వరకు సంపాదించవచ్చంటూ సూచించారు. దీంతో మొదట కెప్రైస్‌రన్నర్‌ప్లాట్‌ఫామ్.కామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని తన ఐడీలోకి వెళ్లి టాస్క్ లు పూర్తి చేశాడు. దీంతో మీకు రూ. 1990 పార్ట్‌టైమ్ ఉద్యోగానికి సంబంధించిన డబ్బులు వచ్చాయంటూ మెసేజ్ వచ్చింది. దీంతో తన ఖాతాలో నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ తరువాత నమ్మకం కుదరడంతో సైబర్‌నేరగాళ్లు మరో ప్రతిపాదన ముందు కు పెట్టారు. మీరు కొన్ని డబ్బులు చెల్లించి టాస్క్‌లు తీసుకుంటే అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చంటూ సూచిస్తూ అందులో లగ్జరీ, ప్రిమియం ప్రాడెక్ట్స్ ఉంటాయని, దాని బట్టి టాస్క్‌లకు డబ్బులుంటాయంటూ నమ్మించారు. బాధితుడు నెమ్మదిగా రూ. 50 వేల నుంచి పెట్టుబడి పెడుతూ దఫదఫాలుగా రూ.3,21,807 నేరగాళ్లు చెప్పిన ఖాతాలో డిపాజిట్ చేస్తూ వెళ్లారు. స్క్రీన్‌పై లాభాలు కన్పిస్తున్నా వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి వీలు లేకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

టోలీచౌకి ఆర్టీఏ కార్యాలయానికి స్థలం కేటాయింపు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : టోలీచౌకి ఆర్టీఏ కార్యాలయ సంబంధిత వాహనాల రిజిస్ట్రేషన్ పరిశీలన ప్రక్రియ ఇకపై అంబేద్కర్‌నగర్ రోడ్‌నంబర్ 78లోని పద్మాలయ స్టూడియో ఎదురుగా ఉన్న సర్వేనంబర్ 403లో జరగనుందని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఇన్నిరోజులు అద్దె భవనంలో కొనసాగిన ఈ కార్యాలయానికి ఎకరా ముప్పై గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో టోలీచౌకి ఆర్టీఏ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించనున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి వాహనాల పరిశీలన ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, మిగిలిన సేవలన్నీ ప్రస్తుతం ఉన్న ఆర్టీఏ కార్యాలయంలోనే కొనసాగనున్నాయి. మరింత సమాచారం కోసం ఫోన్: 9989240356ను సంప్రదించాలని అధికారులు వివరించారు.

58 ఎన్‌డీపీఎల్ బాటిళ్లు పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): డిఫెన్స్ క్యాంటిన్‌లలో ఆర్మీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు విక్రయించే మద్యం పక్కదారి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల నుంచి మద్యం మాఫియాలు తక్కువ ధరకు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మల్కాజిగిరి, మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు ఉప్పల్, ఘట్‌కేసర్, మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 28డిఫెన్స్ మద్యం బాటిళ్లు, గోవా నుంచి తరలిస్తున్న 30నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన లారీ.. ఫుడ్ డెలివరీ బాయ్ మృతి

దుండిగల్, జూన్ 19: ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో ఫుడ్‌డెలివరీ బాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని, నాగులపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సాయికుమార్ (21) దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చి గాగిల్లాపూర్‌లో నివాసం ఉంటూ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో సాయికుమార్ తన ద్విచక్ర వాహనంపై సూరారం చౌరస్తా వైపు నుంచి షాపూర్ నగర్‌వైపు వెళ్తుండగా సాయిబాబా నగర్ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటుండగా... ఇసుకలోడుతో ఉన్న లారీ ఢీ కొట్టింది. దీంతో సాయికుమార్ లారీ వెనుక టైర్ల కింద పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ పై దాడి కేసులో ట్విస్ట్

- తండ్రి జైలుకు వెళ్లొద్దని నేరం మీదేసుకున్న కొడుకు
- మామను వదిలిపెట్టి భర్తపై ఫిర్యాదు చేసిన భార్య
- నేరం చేసిన మామ, సాక్ష్యం తారుమారుచేసిన భర్త అరెస్ట్

బంజారాహిల్స్, జూన్ 19: ఆవేశంలో కోడలు మీద కత్తితో దాడికి పాల్పడిన మామ.. వృద్ధుడైన తన తండ్రిని జైలుకు పంపించడం ఇష్టంలేక భార్యను బతిమాలి తనపై నెపం వేసుకున్న భర్త.. తండ్రే మద్యం మత్తులో గొడవపడి తల్లిమీద కత్తితో దాడి చేశారంటూ సాక్ష్యం చెప్పిన కొడుకులు.. పోలీసుల విచారణలో అసలు విషయం బయటకు రావడంతో కోడలిపై కత్తితో దాడిచేసిన మామతో పాటు సాక్ష్యాలను తారుమారు చేసిన కొడుకు కటకటాలపాలయ్యారు. సినీఫక్కీలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణానగర్ సీ బ్లాక్‌లో నివాసం ఉంటున్న సీహెచ్ అరుణ్‌ప్రసాద్(45)కు భార్య జయలక్ష్మి(42)తో పాటు ముగ్గురు కొడుకులున్నారు. అతను ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, భార్య జయలక్ష్మి గృహిణి. కాగా వారితోపాటు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్న తండ్రి వెంకటేశ్వరరావు(68) కూడా నివాసం ఉంటున్నాడు. కొన్ని అరుణ్‌ప్రసాద్ తరచూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడుతుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం తనమీద భర్త కత్తితో దాడి చేశాడంటూ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయలక్ష్మి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

విచారణలో ట్విస్ట్..

హత్యాయత్నం కేసు విచారణలో భాగంగా ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అరుణ్‌ప్రసాద్ పాత్రపై ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బాధితురాలి ఫిర్యాదులో మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో తన భర్త దాడి చేశాడని పేర్కొంది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని తేలింది. దీంతో బుధవారం రాత్రి నిందితుడిని మరోసారి విచారించిన పోలీసులకు అసలు విషయం తెలిసింది. భార్యను ఎందుకు చంపాల్సి వచ్చిందని, అనసరంగా జైలుకు వెళ్తున్నావంటూ అరుణ్‌ప్రసాద్‌ను ప్రశ్నించగా.. తన భార్యను తానెందుకు చంపుకుంటానంటూ కన్నీళ్లపర్యంతం అయ్యాడు. స్వల్ప విషయాల్లో అప్పుడప్పుడూ తన తండ్రి వెంకటేశ్వరరావుకు, తన భార్య జయలక్ష్మికి గొడవలు జరుగుతుంటాయని, ఇదే క్రమంలో బుధవారం ఉదయం గొడవ జరగడంతో మాటామాటా పెరిగి తన తండ్రి వెంకటేశ్వరరావు ఆవేశంలో జయలక్ష్మి మీద కత్తితో దాడి చేశాడని, దాంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించారని అంగీకరించాడు. ఘటన జరిగిన సమయంలో తాను ఇంట్లో లేనని, ఆస్పత్రికి వెళ్లిన తర్వాత దాడి ఘటన గురించి తెలిసిందని అరుణ్ ప్రసాద్ పేర్కొన్నాడు. వృద్ధుడైన తన తండ్రి జైలుకు వెళ్లడం ఇష్టంలేక నేరాన్ని తనపై వేసుకుంటానని బతిమాలడంతో భార్య జయలక్ష్మితో పాటు పిల్లలు కూడా ఒప్పుకున్నారని వివరించాడు. దీంతో ఇంట్లోని రక్తపు మరకలను తొలగించి మధ్యాహ్నం తర్వాత ఫిర్యాదు చేశామని తెలిపాడు. దీంతో హత్యాయత్నం కేసులో మామ వెంకటేశ్వరరావును నిందితుడిగా చేర్చిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. సాక్ష్యాలను తారుమారు చేసిన అరుణ్‌ప్రసాద్ మీద సైతం కేసు నమోదు చేశారు.

దుర్గం చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

అదనపుకట్నం కోసం వేధింపులే కారణం!

సుష్మ (ఫైల్)

కొండాపూర్, జూన్ 19 : అదనపు కట్నం కోసం అత్తమామలు, భర్త, మరిది వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అంజయ్య కుమార్తె